క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు వేములూరిపాడు విద్యార్థులు



ఫిరంగిపురం: శారీరక మానసిక వికాసానికి ఆటలు ఎంతో దోహదం చేస్తాయని పాఠశాల హెచ్ఎం ఎల్.సాంబయ్య అన్నారు. గుంటూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించిన ఫెన్సింగ్ పోటీల్లో వేములూరిపాడు జిల్లా పరిషత్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ లభించాయి. పాఠశాలలో గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు పాల్గొనగా, నలుగురు బాలురు, ముగ్గురు బాలికలకు టీం గేమ్‌లో గోల్డ్ మెడల్స్ రాగా, సమీనా, షేక్, అబ్దుల్ గనిలకు వ్యక్తిగత బ్రాంజ్, సిల్వర్ మెడల్స్ లభించాయన్నారు. వీరిరువురు ఈ నెల 30, 31న నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవీఎంలు తనిఖీ



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోడౌన్‌లో భద్రపర్చిన ఈవీఎంలను గురువారం జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న వీవీప్యాట్స్, సీసీ కెమెరాలు పరిశీలించారు. సెక్యూరిటీ అటెండెన్స్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్, జె.ప్రసాదరావు, ఆర్ అండ్ బీ ఏఈ అరుణకుమారి, విద్యుత్ ఎల్ఈ మస్తాన్ షరీఫ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యర్రబాలెంలో చోరీ

యర్రబాలెం(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో పట్టపగలే చోరీ జరిగిన ఘటన వెలుగు చూసింది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు యర్రబాలెంలోని నోరివారి వీధికి చెందిన ఫణి శ్రీరామ్ చిట్స్‌లో పని చేస్తుంటాడు. బుధవారం వినాయకచవితి కావడంతో విజయవాడలోని తల్లితండ్రుల వద్దకు భార్యతో కలిసి వెళ్లాడు. అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూడగా తలుపులు తాళాలు పగలగొట్టి ఉండడంతో పాటు బయట ఉన్న ద్విచక్ర వాహనం కనిపించలేదు. లోపలికి వెళ్లి చూడగా దేవుడు గదిలోని రెండు వెండి దీపపు కుందులు, హ్యాండ్ బ్యాగ్‌లోని రూ.15 వేల నగదు చోరీకి గురయ్యాయని గుర్తించి ఫణి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా యర్రబాలెంలో వారంలో మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురికావడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తుంది. నోరివారి వీధిలో నివాసముంటున్న ఫణి ఇంటి బయట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. కాగా ఇటీవల తాడేకోరు రమేష్‌బాబు నివాసం ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనం, జానకీ అమ్మవారి ఆలయ ప్రాంతానికి చెందిన మల్లేష్ వాహనం చోరీకి గురయ్యాయి. దీంతో స్థానికులలో భయాందోళన నెలకొంది. పోలీసుల నిఘా కొరవడడం, రాత్రి వేళల్లో గస్తీ తిరగకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా పెంచి చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.

అంకిత భావంతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు



మర్యాద పూర్వకంగా కలిసిన పోలారెడ్డికి సూచించిన మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, వనమా బాల వజ్రబాబు

తాడికొండ: అంకిత భావంతో పనిచేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని మాజీ ఎంపీ, మూడు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు అన్నారు. తాడికొండ మండల అధ్యక్షుడిగా నియమితులైన వంగా పోలారెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా వారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మోదుగుల, డైమండ్ బాబు మాట్లాడుతూ పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన వారికి భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందని కష్టపడి పనిచేసి 2029లో రాజధానిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ముప్పాళ్ళ మనోహర్, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు దాసరి రాజు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు మల్లంపాటి రాఘవరెడ్డి, వివిధ విభాగాల నాయకులు దమ్మాటి మోహనరావు, షేక్ అజీస్, పులి రమేష్, ఇసుకపల్లి రమేష్, షేక్ జుబేర్, ఖాజావలి, షేక్ జానీ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. తప్పని తిప్పలు



మాతాశ్రీ ఆశ్రమం ఎదురుగా గోతుల మయంగా ఉన్న రహదారి



గాయాల పాలైన చిన్నారి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట మాతాశ్రీ ఆశ్రమం ఎదురుగా ఉన్న రహదారి నుంచి కొలనుకొండ వరకు పలుచోట్ల గుంతలమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు తిప్పలు తప్పడం లేదు. రోడ్డు మొత్తం గోతులమయం కావడంతో గురువారం తల్లితో స్కూల్‌కు వెళుతున్న చిన్నారులకు ఆ గోతుల వల్ల గాయాలయ్యాయి. మాతాశ్రీ ఆశ్రమం దగ్గర నుంచి రైల్వే గేటు వరకు విపరీతంగా గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలు కురియడంతో ఆ గోతుల్లో నీళ్లు నిలిచాయి. దీంతో వాహన చోదకులు గొయ్యి లోతు తెలియక వాటిల్లో పడి గాయాల పాలవుతున్నారు. బ్రహ్మానందపురం నుంచి ద్విచక్ర వాహనంపై తల్లితో కలసి వస్తున్న చిన్నారులకు కూడా ఇలాగే ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు కాగా, దుస్తులు బురదమయమయ్యాయి. కాళ్లకు, చేతులకు దోకుడు గాయాలు అయ్యాయి. ఉండవల్లి సెంటర్‌లో ట్రాఫిక్ మళ్లించినప్పుడల్లా ఈ రహదారిలో అధిక బరువుతో లారీలు ప్రయాణించడంతో ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా ఇదే పరిస్థితి ఏర్పడుతోందని పలువురు అంటున్నారు. ఈ రహదారిలో భారీ వాహనాల రాకపోకలు నిలిపివేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

కేఎల్‌యూలో మానసిక ఒత్తిడి నివారణపై అవగాహన



హాజరైన విద్యార్థినులు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మీనా

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో గురువారం మానసిక ఒత్తిడి నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ మానసిక వైద్యురాలు డాక్టర్ మీనా మాట్లాడుతూ జీవితంలో పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఎదుర్కొంటున్న పరీక్ష ఒత్తిడి సమస్య, ఆందోళన, నిద్రా భంగం వంటి సమస్యలపై విద్యార్థులకు సూచనలు చేశారు. ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసంతో ఉన్నతంగా ఎదుగుతారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సినీ హీరో సుమన్ పుట్టినరోజు వేడుకలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడిలో గురువారం సినీ హీరో సుమన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుమన్ అభిమానులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుమన్ అభిమానులు తాతా కోటయ్య, జూపల్లి వెంకటేశ్వరరావు, వాకా శ్రీనివాసరావు, నాగబాబు వెంకటేష్, బాజీ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగించు విఘ్నేశ్వరా...



సీతారామ కోవెల వద్ద ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం



పట్టణంలో కొలువుదీరిన గణనాథుడు



సీపీఐ స్థూపం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



రాజీవ్ గృహకల్ప వద్ద...

- వాడవాడలా కొలువుదీరిన గణనాథుని విగ్రహాలు
- వివిధ రూపాల్లో ఆకట్టుకున్న లంబోదరుడు

మంగళగిరి టౌన్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో బుధవారం వినాయక చవితి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను, మండపాలను సుందరంగా అలంకరించారు. నియోజకవర్గం అంతా విద్యుత్ దీపాలతో వీధులన్నీ విరాజిల్లాయి. వివిధ రూపాల్లో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. మండపాలతో పాటు వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని సీతారామకోవెల వద్ద ఏర్పాటు చేసిన భారీ విగ్రహం, వివిధ మండపాల వద్ద చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

కొన్ని మండపాల వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణహిత వినాయక ప్రతిమలను, ఎకో ఫ్రెండ్లీ బ్యాగ్‌లు, వినాయకవ్రత కల్ప పుస్తకాలను బుధవారం ఉదయం మిద్దె సెంటర్‌లో ఉచితంగా పంపిణీ చేశారు.

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చతుర్థి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు పందిళ్లు వేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు అవతారాల్లో ఉన్న వినాయకుడి విగ్రహాలు ఉంచి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.



తాడికొండ రెడ్ల బజారు వద్ద నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


గణనాథుడి సేవలో తరించిన భక్తులు

తాడికొండ: వినాయక చవితి పర్వదినాన్ని తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. జోరుగా వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా భక్తులు మండపాల వద్ద అధిక సంఖ్యలో చేరి గణనాథుడి సేవలో తరించారు. వీధి వీధిలో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేయడంతో గ్రామాలు సందడిగా మారాయి. పలు గ్రామాల్లో విగ్రహాలను భారీ ఊరేగింపు నడుమ గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనానికి తరలిస్తున్నారు. గురువారం తాడికొండ రెడ్ల బజారు వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువత భారీగా పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

దుగ్గిరాల: మండలంలోని గ్రామాలలో వినాయక చవితి ఉత్సవాలు బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. దుగ్గిరాల శివాలయం, యాదవ బజారులోని వినాయక విగ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు. మండలంలో 96 విగ్రహాలకు అనుమతి ఇచ్చినట్లు ఎస్సై ఎస్.వెంకట రవి తెలిపారు.

మంగళగిరి: మంగళగిరి రూరల్ పరిధిలో బుధవారం వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ఆకట్టుకున్నాయి.



దుగ్గిరాల యాదవ బజారులోని వినాయకుడు



శిరంగిపాలెంలో...



ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

సెల్‌ఫోన్ల దొంగలు అరెస్ట్

మంగళగిరి: కేటీఎం బైక్‌లపై వచ్చి మాట్లాడుతున్న సెల్‌ఫోన్లు లాక్కుపోయే ఇరువురు దొంగలను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ గురువారం తెలిపిన వివరాల మేరకు చెడు వ్యసనాలకు బానిసలైన మంగళగిరి పట్టణానికి చెందిన మహేష్, తాడేపల్లికి చెందిన మరో బాలుడు ఇద్దరు బైక్‌పై వచ్చి ఎవరైనా రోడ్డు మీద మాట్లాడుతూ ఆదమరిస్తే ఫోన్ లాక్కుని దిచక్ర వాహనంపై పారిపోయి వాటిని విక్రయించి జల్సాలు చేస్తుంటారు. ఈ నెల 25న మల్లేపల్లి మునుస్వామితో మరో ఇరువురు గుంటూరు నుంచి ఆటోలో వినాయక విగ్రహానికి తీసుకువస్తుండగా మునుస్వామి ఆటో డ్రైవర్ పక్కన కూర్చుని మాట్లాడుతుండగా ఎన్ఆర్ఐ ఆసుపత్రి వద్ద మునుస్వామి ఫోన్‌లాక్కుని పరారయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి మహేష్‌తో పాటు అతని స్నేహితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్‌లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ ద్వారా నీటి విడుదల



తాడేపల్లిరూరల్ : మంత్రి నారా లోకేష్ ఆంధ్ర రత్న ఎత్తిపోతలకు తన సొంత నిధులు కేటాయించి విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేయించారు. సుమారు రూ.8 లక్షల 50 వేలతో 150 హెచ్‌పీ మోటార్లకు మరమ్మతులు చేయడంతో గురువారం నూతన మోటార్లను కూటమి నాయకులు స్విచ్ ఆన్ చేసి సాగునీటిని విడుదల చేశారు. మోటార్లకు మరమ్మతులు నిర్వహించడంతో స్థానిక రైతులు, ప్రజలు మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ మోటార్లకు మరమ్మతులు చేయడంతో కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు గ్రామాల్లోని 3,700 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.టీడీపీ నాయకులు కృష్ణ, జనసేన నాయకులు సామాల నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు లక్ష్మణ్, నీటి సంఘం అధ్యక్షురాలు ధనలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ అమర వీరులకు నివాళులు



విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించి ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి

తాడేపల్లిరూరల్: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ 2000 సంవత్సరంలో హైదరాబాద్‌లో జరిగిన విద్యుత్ పోరాటంలో అశువులు బాసిన అమర వీరులకు తాడేపల్లి పట్టణ పరిధిలో సీపీఎం నాయకులు గురువారం నివాళులర్పించారు.

- పట్టణ పరిధిలోని రామయ్య కాలనీలో సీపీఎం నాయకులు దుర్గారావు, నులకపేటలో బూరగ వెంకటేశ్వర్లు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యమం, చలో అసెంబ్లీ కార్యక్రమంలో ప్రజలపై ఆనాటి సీఎం చంద్రబాబు కాల్పులు జరిపించారని, ఆ కాల్పుల్లో అమరులైన విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి, రామకృష్ణల త్యాగాల బాటలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యుత్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేముల వెంకన్న, దుర్గారావు, చంటి, ఇక్బాల్, వైఎస్సార్‌టీయూసీ నాయకులు శ్రీనివాసరావు, దుర్గారావు పాల్గొన్నారు.
- తాడేపల్లి కొత్తూరులో సీపీఎం నాయకులు విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యమాలను బలోపేతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. సీపీఎం కొత్తూరు శాఖ కార్యదర్శి మోదుగుల శ్రీనివాసరెడ్డి, సభ్యులు దోకుపర్తి యోహాను, బొజ్జ సుబ్బారావు, దొంతిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, దశరధరామిరెడ్డి, బుర్రముక్కు గోపాల్‌రెడ్డి, మహేశ్వర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.
- రాజధాని ముఖద్వారమైన ఉండవల్లిలో సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఉండవల్లి సుందరయ్య చౌక్ వద్ద గురువారం విద్యుత్ అమరవీరుల సంస్మరణ ప్రతిజ్ఞను నాయకులు నిర్వహించారు. స్మార్ట్ మీటర్లు వద్దని, ట్రూఅప్ చార్జీలను తగ్గించాలని, ప్రజలపై మోపిన కరెంటు భారాలు ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. నాయకులు ఇమ్మాని యేలు రాజు, బక్కిరెడ్డి, వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఈమని రామారావు, ఎస్కే ఎర్రపీరు, రాఘవయ్య, గాంధీ, పార్థసారధి, మస్తాన్‌రావు, ఓలేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యమాన్ని కొనసాగిస్తాం

ఫిరంగిపురం: స్మార్ట్‌మీటర్లు, సర్దుబాటు విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యమాన్ని కొనసాగిస్తామని సీపీఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండలంలోని పొనుగుపాడు, ఫిరంగిపురం గ్రామాల్లో గురువారం 2000 సంవత్సరంలో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ పోరాటంలో పోలీసు కాల్పుల్లో మృతి చెందిన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తామని చెప్పారు. మార్పుల వెంగలరెడ్డి, ఇబ్రహీం, ఏసు, కె.శ్రీనివాసరావు, సీహెచ్ రామారావు, సతీష్, అశోక్, ఒ.బాలయ్య, సునీత పాల్గొన్నారు.

విద్యుత్ పోరాట అమవీరుల స్మృతి ప్రతిజ్ఞ

మంగళగిరి టౌన్: విద్యుత్ అమరవీరుల స్మృతి సందర్భంగా గురువారం వామపక్ష పార్టీల నేతలు స్మృతి ప్రతిజ్ఞ చేశారు. నగర పరిధిలోని అంబేద్కర్ సెంటర్‌లో సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ పార్టీలు స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 2000లో చేపట్టిన ఉద్యమంలో జరిగిన కాల్పుల్లో రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి ప్రాణాలు కోల్పోయారని, వందల మందికి గాయాలయ్యాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రస్తుత విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా అమరవీరులను తలచుకుంటూ పోరాడాలని పిలుపునిచ్చారు. 14 నెలల కూటమి పాలనలో రూ.27 వేల కోట్లు భారాలు వినియోగదారులపై వేయడం జరిగిందని విమర్శించారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి మంత్రి నారా లోకేష్, సీఎం చంద్రబాబు మాట తప్పారని ఎద్దేవా చేశారు. వామపక్ష నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, వీవీ జవహర్‌లాల్, బాలకృష్ణ, చిన్ని తిరుపతయ్య, జాన్‌బాబు, ప్రభాకర్, ఎం.బాలాజీ పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

దుగ్గిరాల: విద్యుత్ చార్జీల పెంపుదల వ్యతిరేక నిరసనలో నాడు మృతి చెందిన అమరవీరులను మరువలేమని వారి త్యాగాలు విలువైనవని సీపీఎం కార్మిక నాయకులు జెట్టి బాలరాజు అన్నారు. గురువారం దుగ్గిరాలలోని సీపీఎం కార్యాలయంలో అమరుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళి అర్పించి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాట్లాడుతూ నేడు స్మార్ట్ మీటరు పేరుతో పేద ప్రజలపై భారం మోపడానికి ప్రయత్నం చేస్తున్నారని, అదే జరిగితే మరలా ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వై.బ్రహ్మేశ్వరరావు, ఎస్.యోగేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, ఎస్.కరీముల్లా, వె.చలమయ్య పాల్గొన్నారు.

తాడికొండలో...

తాడికొండ: ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్, ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల భారాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, సీపీఐ నాయకులు కాబోతు ఈశ్వరరావు అన్నారు. గురువారం తుళ్లూరు అంబేడ్కర్ విగ్రహం కూడలిలో నిర్వహించిన బషీర్బాగ్ విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. విద్యుత్ సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ప్రజలు మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 25 సంవత్సరాల క్రితం విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న వారిపై అప్పటి సీఎం చంద్రబాబు కాల్పులు జరిపించడంతో ముగ్గురు మృతి చెందడంతో పాటు వందల మంది క్షతగాత్రులు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు మరలా అదే బాటలో కూటమి ప్రభుత్వం పయనిస్తుందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్ అమరుల త్యాగాల స్ఫూర్తిగా మరో ఉద్యమానికి ప్రజలు సిద్ధం కావాలన్నారు. బషీర్‌బాగ్ అమర వీరులను స్మరించుకుంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు పేరం బాబురావు, ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ షేక్ జానీ, సీపీఐ నాయకులు యాకోబు, నాగుల్ మీరావలి, టి.అనురాధ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భారీ వర్షాలు.. నేలకొరిగిన వృక్షాలు



తాడేపల్లిరూరల్ : నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం విస్తారంగా వర్షం కురిసింది. తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 వరకు కురుస్తూనే ఉంది. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారుల వెంబడి వృక్షాలు నేలకొరిగాయి. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ రోడ్డు పరిధిలో ప్రకాష్‌నగర్, డోలాస్‌నగర్, స్పెన్సర్, నులకపేట, పోలకంపాడు తదితర ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. గురువారం కార్పొరేషన్ అధికారులు చెట్లను తొలగించారు. మాగాణి పొలాల్లో అక్కడక్కడ వరినాట్లు మునిగిపోయాయి. ఇప్పటికే పలుమార్లు నాట్లు వేశామని, ఈ వర్షం కారణంగా మరోసారి రైతులకు తిప్పలు తప్పడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

నాగళ్ల సేవలు చిరస్మరణీయం



పెదవడ్లపూడి(మంగళగిరి): పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నాగళ్ల రామకృష్ణయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. గురువారం రామకృష్ణయ్య వర్ధంతి సందర్భంగా పెదవడ్లపూడి చైతన్యనగర్ రేవేంద్రపాడు వంతెన వద్ద జ్ఞానసాయి మందిరంలో రామకృష్ణయ్య కుమారుడు వెంకటరావు ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం, అన్నప్రసాద వితరణ నిర్వహించి రామకృష్ణయ్య సేవలను కొనియాడారు. సీపీఐ నాయకులు భావన లక్ష్మీనారాయణ, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, షేక్ కరిముల్లా, సింహాద్రి వెంకటేశ్వరరావు, మిరియంపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com